# పరుసవేది

బాలాంత్రపు రజనీకాంతరావు

(కర్ణాటక సంగీత పితామహుడు, భక్తాగ్రేసరుడు అయిన శ్రీ పురందరదాసులవారి జీవిత సంఘటనలను కొన్నిటిని చిత్రించే సంగీత రూపకం.)

(గుర్రపు బండ్లు, గుర్రాలు-రాజవీధిలో ఎదురెదురుగా వస్తూ పోతూ వున్న సవ్వడులు)

వ్యాపారి, హనుమప్ప— ఎవరా గుర్రంపై వచ్చేది? సేనాని బసప్పగారు కాదుగదా

సేనాది బసప్ప— బసప్ప నే-అహంభో అభివాదయే - వ్యాపారి హనుమప్పగారనుకుంటాను చాలా కాలమైంది మాసాలు-పండ్లు-పూండ్లు.

హనుమప్ప ఆ— హనుమప్పనే. అభివాదాలు. అభివాదాలు మీరూ యిక్కడే గుర్రం దిగేటట్టున్నారు!

బసప్ప ఈ పక్కకి వచ్చినపుడు ఇక్కడి విఠలస్వామిని దర్శనం చేసుకోవడం వాలాయితీ మీరూ శకటం దిగుతున్నారు అందుకే అనుకుంటాను—

హనుమప్ప అవును విద్యానగరానికి వచ్చినప్పుడల్లా నాలుగు వీధులలోని నలుగురు దేవతా మూర్తులనూ దర్శనం చేసుకొని, ఆ మీదట కృష్ణదేవరాయలవారి దర్శనం చేసుకొని, వెళ్ళటం పరిపాటి—

బసప్ప ఎక్కడినించి రాక- ఎలా సాగుతోంది వ్యాపారం?

హనుమప్ప పడమటి తీరం-గోవా రేవులో బుడతకీచులకీ అరబ్బీ వర్తకులకీ మన రత్నాలు మంచిగంధమూ అమ్మి, వాళ్ల సరకులు సుగంధద్రవ్యాలూ పట్టించుకు వస్తున్నాను

బసప్ప రత్నవర్తకం చేసి కోటికి పడగెత్తినవాణ్ణి నవకోటి నారాయణని చూశాన, మళ్ళీ మిమ్మల్ని చూశాను హనుమప్పగారూ—

హనుమప్ప నవకోటి నారాయణా? మా శీనప్ప— వరదప్ప నాయకుడిగారి కుమారుడు శ్రీనివాస నాయకుడు— ఇప్పుడిక్కడే ఉన్నాడని విన్నాను. అతను మా బంధువు కూడాను.

బసప్ప ఆ, ఇక్కడే వున్నాడు —అయితే ఆ శీనప్ప వేరు, యీ శీనప్ప వేరు.

హనుమప్ప వ్యాపారమూ, వాణిజ్యమూ అంతా వదిలేశాడని విన్నాను నిజమేనా?

బసప్ప ఆ- వదిలేశాడు ఐహిక సంపదలన్నీ వదిలేశాడు. ఇప్పుడు కేవలం పారమార్థికమైన భక్తిమార్గమే ఉండండి -మీ బంధువును చూద్దురుగాని ఇదే సమయం— విఠల స్వామి దర్శనానికి అతను వచ్చే వేళయిదే—

శీనప్ప పాట

(పురందరదాసు)

శీనప్ప పిచ్చి యెక్కినది పిచ్చి యెక్కినది నాకు

అచ్యుతనామం బనెడి మరులొల్కు మచ్చుమందు
తలకెక్కి మైసొక్కి
॥పిచ్చి యెక్కినది॥

వాసుదేవయను వరనామంబును వాయి పగుల
వదరవలె, మాయా
పాశమనెడి అంగీని తునియలుగ పరపరా చింపవలె



http://www.maganti.org

క్లేశమనెడి శిఖపైని విరిచెండు రేకురేకు తుంపవలె, దోష

రాశి యనెడి గోడ బెల్లుబెల్లుగ రక్కిరక్కి తుక్కు రేపవలెనని

॥పిచ్చి యెక్కినది॥

హనుమప్ప శీనప్పా—శీనప్పా—పలకడే

బసప్ప: పలకడు—అదే, తన్మయత్వం తాదాత్మ్యం—భక్తి పారవశ్యంలో పాడుకుంటూ చిందు వేసుకుంటూ అలా వెళ్ళిపోతూంటాడు

హనుమప్ప ఎంతమార్పు? అసలు శీనప్పేనా అనిపిస్తోంది! ఏమిటా ముష్టి వేషమూ పిచ్చిపాటాను

బసప్ప: అది ఉంచవృత్తి వేషం. బ్రాహ్మణపుటక పుట్టినవాడికి ఇంతకంటె మరోటి వృత్తి కాదంటాడు భుజాన జోలె వేసుకుని పాడుకుంటూ చిందులు తొక్కుకుంటూ పోతుంటే, తలో ఇంటా తలో గుప్పెడూ బియ్యమూ పప్పో జోలెలో వేస్తే అది తీసుకుని అపరాహ్ణం దాటాక ఇంటికి చేరుకుంటాడు

హనుమప్ప అయ్యో! కోటికి పడగెత్తిన వాడికి ఇదేంకర్మ బసప్పగారూ? ఎలా ఎక్కింది యీ పిచ్చి

బసప్ప ఇది పిచ్చి అని మీరు అనుకుంటున్నారు కాని, ఆమధ్యమరంలో ఈయన చుట్టూ చేరిన స్వాములవారే చెప్పారు—ఆయనకు జ్ఞానోదయమయిన కథ

హనుమప్ప రండి, ప్రదక్షిణంచేస్తూ చెప్పుకుందాము— ఊ, నడవండి— ఏమిటీ— జ్ఞానోదయం కథా—

శీనప్ప, మీకు తెలిసే ఉంటుంది శ్రీనివాసనాయకుడు కోటీశ్వరుడుగా వ్యాపారంచేసే దినాల్లో పిల్లికికూడా బిచ్చం పెట్టనిలోభి అని

హనుమప్ప. అవును అతనిభార్య సరస్వతమ్మ మాత్రం మంచి దానధర్మపరాయణ బంధువులు మిత్రులు ఇంట దిగితే ఆమెచేసే మర్యాదలు ఎన్నటికీ మరచిపోలేదు,

శీనప్ప ఒక పేదబ్రాహ్మడు ధన సహాయంకోసమని ఎన్నిసార్లు ప్రార్థించినా శీనప్పగారు మర్నాడు రమ్మని పంపేసేవాట్ట

హనుమప్ప ఇంకా నయం ఎందుకిన్నిసార్లు వస్తావని తన్ని తరిమెయ్యడం కూడా అతనికీ అపరూపంకాదు.

బసప్ప ఆ బ్రాహ్మడు సరస్వతమ్మ ఔదార్యం గురించి విని—శీనప్ప అంగడిలో వున్నవేళ ఒకనాడు ఇంటికివెళ్ళి ఆమెని ఎలాగైనా తన దారిద్ర్యం తీర్చమని వేడుకున్నాట్ట

హనుమప్ప ఆ మహాతల్లి వట్టిచేతుల్తో ఎవర్నీ పంపదు

బసప్ప ఇంటిలోఉన్న నగదూ, నగలూ అన్నీ ఇనపపెట్టెల్లో తాళం వేసేసి, తాళాలగుత్తి తనరొంటిదే దాచుకున్నాడు శీనప్ప అప్పుడు సరస్వతమ్మ మరి చేసేదేమీలేక ఆ బ్రాహ్మడిని వట్టినే పంపడం ఇష్టంలేక, తనకు అందుబాటులోఉన్న ఒకపెట్టెలో వజ్రం తాపిన ముంగెర ఉంటే యిచ్చి అమ్ముకొని ఆ డబ్బు తీసుకోమన్నది

హనుమప్ప, శీనప్పకు తెలిస్తే ఊరుకోడే—

బసప్ప వినండిమరి ఆ బ్రాహ్మణుడు ఆ ముంగెర తీసుకుని వెల కట్టించడానికి తిన్నగా శీనప్ప అంగడికే వెళ్ళాడు

హనుమప్ప వెళ్ళాడూ-కొంప మునిగింది,

బసప్ప శీనప్ప అగ్గిరాముడై పోయాడు, ఆ ముంగెర తనభార్య తనకు చెప్పకుండా ఆ ముష్టిబ్రాహ్మడి కెందుకిచ్చిందని-తన అంగడిలోని వ్రాయసంగారిని చీటీయిచ్చి వెంటనే యింటికి పంపాడు

హనుమ, ఈ చీటీయా

బసప్ప అవును ఇంటిలో ఫలానా చందుగా పెట్టెలోని ముక్కు ముంగెర పంపించమని భార్యకు చీటి వ్రాశాడు

హనుమప్ప అది చదువుకుని ఆవిడ బెంబేలు పడిపోయుంటుంది.

బసప్ప. మూర్ఛపోయింది " లేని ప్రాణంమీద నిరాశ చేసుకుని ఒకపాత్రలో విషం పోసుకుని, దేవతార్చనగదిలో విఠల స్వామికి సాష్టాంగపడి భర్తకు ఇష్టంలేకుండా తాను చేసిన దానానికి ప్రాయశ్చిత్తంగా ప్రాణాలు హరించుకోడానికి సిద్ధమయింది

హనుమమ్మ: ప్రాణాలు తీసేసుకుందా (ఆత్రంగా)

బసప్ప ఆమె ప్రార్థన పూర్తయి కన్ను విప్పేసరికి ఆ విష పాత్రలో మెరుస్తూ ఒకవజ్రం తాపిన ముక్కుముంగెర పడి ఉంది

హనుమప్ప చిత్రం—ఎలా వచ్చింది

బసప్ప అప్పుడామె విఠలస్వామికి వందనాలర్పించి, విషపాత్ర ఒలకబోసి ముంగెర శుభ్రంగా కడిగేసి, ప్రాయసంగారి చేత అంగడికి పంపింది,

హనుమప్ప ఎంత చిత్రం-శీనప్ప అదిచూసి ఏమన్నాడో—

బసప్ప శీనప్ప నిర్ఘాంతపోయాడు రత్నపరీక్షకుల్లో అతన్ని మించినవారు లేరుగదా ఆ వజ్రం తాపిన ముంగెర బ్రాహ్మడు తెచ్చియిచ్చినది తనచేతిలో అంగడిలో ఉండగా ఇంటిలో ఉన్న సరస్వతమ్మ ఇంకో ముంగెరకు అచ్చంగా అలాంటిదాన్ని ఎలా సంపాదించి పంపిందని అతని ఆశ్చ ర్యానికి అంతుపట్టలేదు

హనుమప్ప ఆశ్చర్యమా-పరమాశ్చర్యమూ—

బసప్ప వెంటనే బ్రాహ్మణుడికిచ్చిన ముంగెరకి వెలకట్టి పంపేసి, రెండో ముంగెరతో ఇంటికివచ్చి భార్యని, ఎలావచ్చిందీ ముంగెర-ఇది ఒకదాన్నే చేయించి యింట్లో వుంచేనే అచ్చంగా అలాటిది ఇంకోటి ఎలావచ్చింది చెప్ప మన్నాడు,

హనుమప్ప పాపం ఆ అమాయకురాలు విషపాత్ర పుచ్చుకోవ డం, అదంతా చెప్పి ఉంటుంది

బసప్ప చెప్పింది హనుమప్పగారూ— విఠలస్వామి అనుగ్రహం ఆమెకి కలగడం ఆమె దానధర్మ పరాయణతవల్లనే అని అని అతనికి తెలిసి ఆ క్షణమే అతనికి జ్ఞానోదయమైంది దానం తీసుకున్న బ్రాహ్మడే విఠలస్వామి అయి ఉంటా డని ఆయనకోసం వెదికాడు. ఆయన మళ్ళీ దొరకలేదు. అదిమొదలు విఠలస్వామికి పరమభక్తుడై, తన సంపాద నంతా దానాలు చేసేశాడు

హనుమప్ప సరి, సంపద ఉంచుకొనీ, పెంచుకొనీ దానాలు చెయ్యాలికాని, అంతా వదులుకుని ముష్టిలో పడితే దానాలేం చేస్తాయయ్యా బసప్పగారూ?

బసప్ప అడుగో గరుడ స్తంభంవద్ద, చిందుతొక్కుతూ శీనప్ప.

శీనప్ప. పాట

కమలనయను పదకమలమ్ముల పడి కుమిలి కుమిలి
పారలవలె, తా
పముల కుంభమును ముక్కముక్కలుగ
పగులగొట్టి వేయవలె
కంటబడిన పెద్దల నిష్టాత్ముల వెంటవెంట
తగులవలె? నిత్యము
తుంటరు లెదురైన రాయిరప్పలు చూసిచూసి
విసిరి కొట్టవలెనని॥
॥పిచ్చియెక్కినది॥
మందమతులు తారసిల్లగమ్మని మౌనమే
వహియించవలె హరి
నిందా పరుల పయిని దుమ్ము ధూళియు
నిలువకుండ చల్లవలె
అందరకును తండ్రియైన యా శ్రీహరి
పురందర విఠలు పాదములను
పొంద జేయు జనుల చేరి కీర్తన పాడిపాడి చిందు
తొక్కవలెనని॥
॥పిచ్చి యెక్కినది॥

హనుమప్ప పిచ్చి బాగా యెక్కింది

బసప్ప వెళ్ళిపోతున్నాడు ప్రతిదినం-ఉదయం కమలాపురం లోని మధ్వమఠంనుంచి బయలుదేరి, నడుము యిళ్ళూ వీధులూ దాటుకుంటూ, హజార రామస్వామి ఆల యంలో, రాముల వార్ని సేవించి మతంగమహర్షి కొండ నెక్కి నరసింహస్వామి కొలువు చూసుకుని—ఆ తర్వాత విఠలస్వామి దర్శనం చేసుకుని యిలా యీ పక్కగా తుంగభద్ర అవలి వొడ్డుదాకా పోతూవుంటాడు

హనుమ: నాకేమో ఇదంతా పిచ్చిలాగే ఉంది సుమా బసప్ప గారూ-అంగీ చింపుకుంటానంటాడు, పూలచెండు తుంపు కుంటోంటాడు, గోడ బెల్లులు రక్కుతానంటాడు. కుండ పగులగొడతాట్ట. దుమ్ము ధూళీ చల్లుతాట్ట-పిచ్చి చిందులు తొక్కుతాట్ట.



http://www.maganti.org

బసప్ప భక్తికీ, పిచ్చికీ ఏదో అవినాభావ సంబంధం వుందేమో? హానుమప్పగారూ—

హానుమప్ప ఇంతకీ, మా వేలువిడిచిన అక్కగారు సరస్వతమ్మను చూడాలి రాజవీధిలో ఉన్నా మా ఆవిడను తీసుకుని శీనప్ప యింటికి వెళ్ళి అక్కగారిని చూదామనిపిస్తోంది

బసప్ప ఆ మహాతల్లి తప్పకుండా దర్శనీయురాలే రండి - విఠల స్వామిని దర్శించి ప్రసాదం తీసుకుని వెడదాము

(నైవేద్య ఘంట)

(గుర్రాలు-గుర్రపుబండి చప్పుడు)

హానుమప్ప శ్రీనివాస నాయకులు ఉండేదిక్కడేనా-

సరస్వతి ఎవరు వారు-

హానుమ, పరదేశులం

పద్మ. బంధువులం—అత్తిగా, నేమా మీ తమ్ముడుగారూ వచ్చాం

సరస్వతి ఎవరూ— పద్మా- హానుమప్పగారూనా— ఎన్నాళ్ళకి రండి రండి!

హానుమ ఊ సిద్ధప్పా! ఆ మూటలూ పెట్టెలూ అక్కడపెట్టి చెరువుగట్టున బండివిప్పేసి, గుర్రాలకు నీళ్లు పెట్టవోయి

పద్మ ఎంత మారిపోయారమ్మా-అన్నయ్య ఇంట్లో లేరా?

సరస్వతి నగర సంకీర్తనమూ నాలుగు దేవరల దర్శనమూ చేసుకుని అపరాహ్ణానికి ఇంటికి చేరుకుంటారు

హానుమప్ప అంతటి ధనవంతుల్లో ఐశ్వర్యంతో గడిపి, ఇలాంటి మఠంలో ఎలా ఉండగలుగుతున్నారమ్మా

సరస్వతి మీ బావే అంతగా మారిపోయినప్పుడు నాకివన్నీ ఒక లక్ష్యమా నాయనా,

పద్మ పిల్లలేరీ అత్తిగా-నలుగురనుకుంటాను

సరస్వతి ఐదుగురు

పద్మ, పెద్దబాబు వరదప్పది మామగారి పేరే-

సరస్వతి, అవును వాళ్ళంతా అప్పగారు కూర్చే సంకీర్తనలను పలకలమీద వ్రాసుకుని విఠలస్వామి కోనేటిలో స్నానం చేసి, అక్కడే ఆ కీర్తనలు పాఠం చేసుకుని వస్తారు

హానుమప్ప, బావగారి పిచ్చి వాళ్లకీ పట్టిస్తున్నారన్నమాట.

పద్మ ఏగూటి చిలకకి ఆ గూటి పలుకన్నారు అన్నగరు వ్యాపారం చేస్తున్న ఆనాడే వాళ్లు కళ్ళు తెరిచుంటే వాళ్ళకీ ఆ వ్యాపకాలే వచ్చేవి

సరస్వతి- అలా అంటావు గాని, పద్మా, ఎన్ని జన్మలో పుణ్యం చేసుకుంటే గాని భగవంతుడిపై భక్తి, నిత్య సంకీర్తనమూ అబ్బుతాయా.

హానుమప్ప- అవునక్కా నువ్వు అలాగనక ఇంకేమంటావు?- మొదట బావగారు మారిపోవడానికి కూడా నువ్వే కారకురాలవని విన్నాను

సరస్వతి- ఎవరు మారడానికి ఎవరు కర్తలు నాయనా అన్నిటికీ ఆ జగద్భర్త విఠలస్వామే కర్త

'వరదప్పా, రుక్మిణీ మొదలైన వారు సంకీర్తన చేస్తూ వస్తారు'

(కేదార రాగం - ఆదితాళం)

నాపై ఆన, రంగా నీపై ఆన
నాపై నీపై మన ఇద్దరిపై 'భక్తవరుల ఆన'

పద్మ— అరుగో పిల్లలు వచ్చారు

సరస్వతి— తండ్రి చేసిన సంకీర్తనమే పాడుకుంటున్నారు. బాబూ వరదా, రుక్కూ, ఇరుగో హానుమప్పమామా, పద్మత్తయ్యావచ్చారు వాళ్ళకి మీనాన్న చేసిన సంకీర్తనలు వినిపిస్తూ ఉండండి నేనిప్పుడే పొరుగింటికి వెళ్ళి వస్తాను.

వరదప్ప, రుక్కు— 'పాట'

నిన్ను విడిచి అన్యుల భజించితే నాపై ఆన, రంగా
నన్ను నీవు కైవిడి పుచ్చితే నీపై ఆన—
తను మన ధనముల వంచన చేసిన నాపై ఆన, రంగా
మనసు నీపయిని నిలువకున్నచో నీపై ఆన
కాపురుషుల సంగాత మొందితే నాపై ఆన, రంగా
ఆ పయి లౌకికమెడయకున్నచో నీపై ఆన
శిష్టమైత్రినే పొందకున్నచో నాపై ఆన, రంగా
దుష్టమైత్రి నే విడువకున్నచో నీపై ఆన
హరి నీ శరణమునందకున్నచో నాపై ఆన, రంగా
పురందర విఠల నన్నేలకున్నచో నీపై ఆన

సరస్వతి పద్మా పెరటిలో కాగుతో వేడి నీళ్ళు పెట్టాను. నువ్వూ మీవారూ స్నానాలు చేసి రావచ్చు.

పద్మ అయితే లేవండి మరి

హనుమప్ప ఎందుకమ్మా- అంత శ్రమపడ్డావు కోనేటికి వెళ్ళి స్నానంచేసి వచ్చే వాళ్ళమే

సరస్వతి మేము మారాముగదా ఆని, మావల్ల మీ అలవాట్లూ, మర్యాదలూ మానడమెందుకని,- అన్నీ ఏర్పాట్లు చేశాను స్నానాలు చేసిరండి బావగారు వచ్చే వేళకి భోజనాలకీ కూడా లేవొచ్చు

హనుమప్ప నువ్వు సాక్షాత్తు సరస్వతీదేవి వమ్మా అక్కయ్యా.

పద్మ వచ్చింది మొదలు అక్కగారిని స్తుతించడమే- లేవండి స్నానానికి

'వాద్య సంగీతం'

వరదప్ప అమ్మా ఈ బంగారు పాత్రలూ, ఈ పప్పులూ, భక్ష్యాలూ ఇవన్నీ ఎప్పుడు తెచ్చావమ్మా-

సరస్వతి పొరుగింటి శ్రీదేవమ్మ గారి నడిగి వరుసవేది ఎరువు తెచ్చాను దానితో కొన్ని ఇత్తడి పాత్రలూ పళ్లేలూ బంగారంగా మార్చి, వాటితో అంగడికి పోయి ఈ సామానులు తెచ్చాను

వరదప్ప ఎందుకు ఇవన్నీ తేవడం?

సరస్వతి మరి వచ్చిన చుట్టాలు కోటీశ్వరులు మనంసంపదలతో తులతూగేటప్పుడు మనింట్లో ఏ మర్యాదలు చేసే వారమో ఆ మర్యాదలన్నీ జరగొద్దూ వారికి.

వరదప్ప ఏమోనమ్మా- అప్పగారివన్నీ చూస్తే ఎమంటారో-

సరస్వతి అరుగో- మాటలోకే వస్తున్నారు వెళ్ళి చేతిలోని తంబురా అందుకో.

శీనప్ప అప్పా- ఈ పొద్దున మనింటికి చుట్టాలు వచ్చారు,

శీనప్ప భాగవతులా

వరదప్ప కాదు ఆ తాళపు చిప్పలు కూడా నాకే యివ్వండి

శీనప్ప ఏమర్రా- తమ్ములు గురురాయుడు మధ్వప్పా ఏరీ.

సరస్వతి చుట్టాలతో ఉన్నారు జోలె ఇటివ్వండి.

శీనప్ప, ఊఁ విఠ్ఠల విఠల- చుట్టాలెవరూ ఇంతకీ ఎవరైనా యోగీశ్వరులా-

సరస్వతి కాదు- ఇవిగో నీళ్లు- కాళ్ళు కడుగుకోండి

శీనప్ప ఓహో ఇదేమిటి- ఎత్తిచ్చి కరగిపోసిన ఇత్తడి బంగార మాయె ఈ బంగారు చెంబు ఎక్కడినించి వచ్చింది

వరదప్ప మన యింట్లో చెంబే-మీరన్నట్లుగానే ఇత్తడి బంగారమైంది

శీనప్ప హరిపురేందర, హరిపురేందర- ఇంతకీ చుట్టాలెవరు చెపుమా-

హనుమప్ప నమస్కారాలు శీనప్ప బావా- చాలా కాలానికి దర్శనం

పద్మ నమస్కారం అన్నయ్యా- అత్తిగనీ మిమ్మల్నీ చూచి పోదామని వచ్చాం

శీనప్ప పురందర విఠలా పురందర విఠలా

హనుమప్ప వర్తక వాణిజ్యాలు వదలి నువ్వు భక్తిమార్గంలో పడిపోయావు బావా- నవకోటి నారాయణ మా బావ గారు అని చెప్పుకుని మీ ఆశీర్వచనంవల్ల నేను వ్యాపారము వాణిజ్యాలలో ఇటీవలే నవకోటి హనుమప్ప బిరుదం పొందాను బావా

పద్మ 'ఒక్కనాడు కూడా మీ పేరు తలవని క్షణం ఉండదన్నయ్యా, మీ బావకి

శీనప్ప పురందర విఠల పురందర విఠల! వరదా, రుక్మా- సరస్వతీ- ఈ పాత్రలు, ఈ పళ్ళేలు, ఈ పీటలు చెంబులు, ఇవన్నీ బంగారపువి ఎలా వచ్చాయి మనింటికి?

సరస్వతి. నేనే- పొరుగింటి శ్రీదేవమ్మగారి వరుసవేది తెచ్చి,

శీనప్ప శ్రీదేవమ్మగారి వరుసవేదా?- పాండురంగ- పాండురంగా- ఇదేవటి- ఈ భక్ష్యాలు భోజ్యాలు ఇవెక్కడివి? మన వంటిల్లంతా ఆ వరుసవేదితో బంగారం చేసేశావా సరస్వతీ-



http://www.maganti.org

సరస్వతి అవును కొన్ని పాత్రలను అంగడిలో ఇచ్చి, విందు సామగ్రి అంతా తెచ్చాను

శీనప్ప: విందు సామగ్రా? మనం ఎందుకు చెయ్యాలి అంత గొప్ప విందు? మన ఉంఛవృత్తి సంసారానికింత గొప్ప విందేమిటి?

సరస్వతి మీ బావ కోటీశ్వరులు కదామరి. వారికి తగిన అంతస్థులో విందు చెయ్యవద్దా అని అలా చేశాను.

శీనప్ప మన అంతస్థు మాటేమిటి? ఎంతపని చేశావు సరస్వతీ నన్ను మరచావు నా నియమ నిష్టలు మరిచావు— నన్నూ నీ అంతస్థునూ మార్చిన పరసువేదివి నువ్వు- నిన్ను నువ్వే మరచిపోయావా సరసూ.

సరస్వతి (దగ్గదికతో) మీ మనస్సుకింత నొప్పి కలిగిస్తాననుకోలేదు అపచారమైపోయింది మన్నించండి అదేవిటీ- ఆ పాత్రలు, ఆ వంటకాలు, అన్నీ, అన్నీ ఏం చేస్తున్నారు

హనుమప్ప క్షమించాలి బావగారు— మా రాక మీ నియమ నిష్టలకి భంగం కలిగించిఉంటే— అయ్యో, అదేవిటి, అక్కగారు శ్రమపడి వండినవన్నీ-ఆపాత్రలూ పళ్ళాలూ అన్నీ మూటగట్టి— ఏం చేస్తారు

పద్మ ఏం చేస్తారన్నయ్యా, ఎక్కడికీ ఆ మూటతో-

సరస్వతి ఇదిగో— ఎక్కడికి ఆ మూటతో- అయ్యో- అది- ఆ రాయి అదే పరుసవేది- అది మనదికాదు ఇలా తెండి,

శీనప్ప ఏది మనదికాదు భక్ష్యాలు, వంటకాలు, పాత్రలు, పళ్ళాలు, పరుసవేదీ— అన్నీ పురందర విఠలస్వామి కోనేటికి అర్పించి వస్తాను

సరస్వతి ఇదిగో— ఏమండీ

హనుమప్ప బావా శీనప్పా,

పద్మ అన్నయా, అన్నయ్యా,

వరదయ్యా, రుక్కు: అప్పగారూ అప్పగారూ!

(శీనప్ప మూటతో వెళ్ళిపోతాడు)

వీణాతానం

శీనప్ప హరిపుందరా హరిపుందరా— అర్పించి వచ్చాను కోనేటికి,

సరస్వతి: మన వస్తువులు మనం ఏమైనా చేసికోవచ్చు. పరాయి వారి పరుసవేది వారికి ఇచ్చివేసి ఉండాలి.

శీనప్ప ఒహో అలాగా. అయితే సరే. నాయనా వరదప్పా, విఠలయ్య కోనేటిలో దిగి నీ దోసిటితో దోసెడు తీసుకు రా- పరుసవేదిరాళ్ళు. అన్నీ ఆ శ్రీదేవమ్మ కేయిచ్చిరా.

వరదప్ప, ఇప్పుడే ఇచ్చివస్తా నప్పగారూ.

శీనప్ప సరస్వతీ, చుట్టాల్నిలా తీసుకురా— రండి పద్మా, హనుమప్పా, పిల్లల్ని అందర్నీ పిలు రుక్కమ్మా గురురాయము మధ్వపతీ అంతారండి. ఇలవేల్పు విఠలయ్య మందిరంలో కొలువున్నాడు- రండి— అంతా కొలువు దగ్గరకి.

బావా హనుమప్పా. మీకు నవకోటి నారాయణగా పేరు పడిన శీనప్పే బాగా తెలుసు. ఆ నవకోటి నారాయణ పనికిమాలిన ఇత్తడి వంటివాడు. ఆ యిత్తడికి బంగారం చేసిన పరుసవేది విఠల నామం ఆవిఠలకీర్తనమనే బంగారాన్ని నాకందించిన పరుసవేది యీసరస్వతి— నాసరస్వతి—నా సరస్వతే నాపాట నాసంకీర్తనం— నా రక్తి, నా భక్తి, నా ముక్తి, విఠలనామమే సరస్వతి 1 నా సంగీతం నా సాహిత్యం అదే— అలలేని పరుసవేది వేరేది?

పాట

దేవగాంధారి-ఆది

వెలలేని పరుసవేది- వేరేది- యింకేది

నలిన నాభు భజనముకంటెను పరమేది ప్రియమేదీ,
ఏదీ, ఎదీ, ॥ వెలలేని॥

హీనలోహసమ మానవ జన్మను, పైనిలోన
పైడిసేయు నేది

కలుషరాశి కూలద్రోసి కాంచన కహిగరిమ కలుగ
జేయునేది ॥ వెలలేని॥

ఆకులేని అలరులేని మ్రోడగు మ్రాకు నేని
చివురించి విరియించి
పాటరాని భక్తిలేని మూగకు పాట ఆటభక్తి
నేర్పు నేవె ॥వెలలేని॥
ఉపనిషత్తుకంటె సులభమయి పరమ పవిత్ర
పచోభి రామపదమై
అపరిమితానంతధామమైన హరిపురందర
విఠలకీర్తన వినా ॥వెలలేని॥

వెలలేని పరుసవేది. వేరేది 1

(విఠ్ఠలస్వామి దేవాలయ ఘంటానాదం)

(వేద పఠనం)

ప్రకటన విఠలస్వామి సన్నిధిలో వ్యాసరాయగురు పీఠాధిపతి
సత్యధర్మాచార్యులు తీర్చిన సభాస్థలి

ప్రవచనం అల్లదకర్మవ ఆచరిసిదవకెట్ట
ఎల్లరొళగె విరోధిసిదవకెట్ట
బల్లిదరొడనె సెణసాడువవకెట్ట
లల్లె మాతిన సతియనంబిదవకెట్ట
ఫుల్లనాభనమ్మ పురందర విఠలన
మెల్లడి నంబిదవ కెట్ట నరగేడి—1

తాత్పర్యం కూడని పనులాచరింప ఒనగూడును వినాశమ్ము
ఎల్లరతో విరోధింప నెపయు వినాశమ్ము
బల్లిదులగు వారితోడ పోరాడుట వినాశమ్ము
కల్లవలపు తొలికే సతి కామించుట నాశనమ్ము
పుల్లకమల నాభుడయిన పురందర విఠలుని మెల్ల
మెల్లని యడుగులిసుమంత నమ్మకున్న వినాశమ్మె

ప్రవచనం గురియ నెచ్చవనె ఖిల్లాళు
హరియ భజిస లరియదవనె మోసాళు
హరియందు ఓదదెల్లవు హాళు
పురందర విఠల ప్రార్థన మనెయాళు॥

తాత్పర్యం గురితప్పక కొట్టువాడు గొప్ప విలుకాడు
హరి భజన మెరుగని వాడు మోసగాడు
హరిని గూర్చి చెప్పని చదువు గోలపాడు
పురందర విఠలుడు ప్రార్థని ఇంటి పనివాడు.

ప్రవచనం నరవృంద వెంబ కాననదల్లి శ్రీ
హరి నామ వెంబంథ కల్పవృక్ష హుట్టితయ్యా
నెరళు సేరలుంటు ఫలవు మెల్లలుంటు
నాలిగెయలి నామత్రయ గళుంటు
ఇదే మనుజర మనద కొనెయరావు
ఇదు బ్రహ్మాది గళ సదమల హృదయ పీఠ
ఇదే ద్వారక, ఇదే క్షీరాంబుధి, ఇదే పురందర
విఠలన మందిర॥

తాత్పర్యం నరబృంద మనెడి కాననమందు- శ్రీ
హరినామ కల్పవృక్షము పుట్టెనయ్యా
చేర చల్లని నీడ, ఆరగింపగ పండ్లు
నాల్కపై కలదందు నామత్రయంబు
ఇది మనుజ హృదయముల కంతిమాశ్రయము
ఇదియె బ్రహ్మాదులకు సదమల హృత్పీఠి
ఇదియె ద్వారక ఇదియ క్షీరాంబునిధి—ఇదియె
హరిపురందర విఠలు ఆనందమందిరము

సత్యధర్మ శ్రీనివాసా! శ్రీ పురందర విఠల స్వామి పూర్ణాను
గ్రహము నీ కీనాడు లభించింది

తీర్థులు సహస్రాధికములయిన నీ సంకీర్తనములను స్వామి
అప్యాయముగా స్వీకరించారు. నేటి నుండి నీవు పురం
దర దాసను పవిత్ర నామముతో ప్రసిద్ధుడవవుతావు.
సంకీర్తనాత్మకములైన నీ బోధలు పురందరోపని
షత్తుగా చిరస్థాయులు కాగలవు మూగపోయిన
గొంతులు నీ సంగీతములో పల్లవించి మధురగానమును
వెలార్చగలవు కరకు రాతి గుండెలు నీ సాహిత్యమున



http://www.maganti.org

కరిగి మధుర భక్తి మకరందములో ఓలలాడగలవు.
ధన్యుడవు పురందరదాసా ధ్యన్యుడవు—

బృందగీతి

ఉపనిషత్తుకంటె సులభమయి పరమ
పవిత్ర వచోభిరామ పదమై
అపరిమితానంద ధామమైన హ
రిపురందర విరల కీర్తన వినా
వెలలేని పరుసవేది, వేరేది, యింకేది,
సలిన నాథు భజనముకంటెను పరమేది

ప్రియమేది ఏదీ !



Source: A.P. Press Academy Website, Natya Kala - 1964

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan